సీజనల్ వ్యాధులపై నజర్

- దోమల నివారణపై దృష్టిసారించిన నీలగిరి మున్సిపల్ సిబ్బంది
- ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన


ట్యాంకులోని నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది


ట్యాంకు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : ప్రతి సంవత్సరం వానలు మొదలుకాగానే సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతుంటారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు మున్సిపాలిటీ నజర్ పెట్టింది. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేలా మున్సిపల్ కమిషనర్ రమణాచారి మెప్మా ఆర్పీలతో ఇటీవల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అన్ని వార్డుల్లోని మెప్మా ఆర్పీలు దోమల నివారణపై ప్రచారం కల్పించి స్థానిక మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ శానిటేషన్ ఉద్యోగులు వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి స్లమ్ ఏరియాల్లోని పేదల ఇళ్లల్లో పూల కుండీలు, పాత సామగ్రి, నీటి ట్యాంకులు శుభ్రం చేయడం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలోని పాత సామగ్రి, కుండీలను శుభ్రం చేసి చూపించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలను చైతన్యం చేయడం వల్ల దోమల వ్యాప్తి నివారించి సీజనల్ వ్యాధులను అరికట్టే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల 10 నిమిషాల కార్యక్రమం చేపట్టడం ద్వారా ప్రజల్లో ప్రచారం కల్పించాలని భావిస్తోంది.

ప్రజల్లో చైతన్యంతోనే వ్యాధులకు చెక్..

పట్టణంలో సీసీ రోడ్లు లేని కాలనీల్లో నీరు నిల్వ చేరడం, కొన్నిచోట్ల డ్రెయినేజీల నుంచి మురుగు సాఫీగా వెళ్లకపోవడం లాంటి కారణాలతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటువంటి ప్రాంతాల్లో దోమలు ఆవాసం ఏర్పరచుకుని ఒక్కో దోమ మూడు వేల గుడ్ల వరకు పెడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎండా కాలంలో వాడే కూలర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు జనావాసాల మధ్య ఉండడం, వానాకాలంలో నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, లెట్రిన్ ట్యాంకుల గ్యాస్ పైప్‌లకు నెట్ పెట్టకపోవడం లాంటి కారణాలతో దోమల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. వీటిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా సీజనల్ వ్యాధులను తగ్గించవచ్చు. దోమల ద్వారా డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, మలేరియా లాంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రులకు వెళ్లి ప్రాణాలను కాపాడుకునేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మన ముంగిట్లో మన కోసం మనమే పరిష్కరించుకోవాలనే నినాదంతో మున్సిపల్ సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



పాత టైర్ల దుకాణాలు, కుండల దుకాణాలు, ఖాళీ కొబ్బరిబోండాలు నీరు నిల్వ ఉండి దోమలు ప్రబలుతున్నాయి. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నాలాలు, మురుగు కాల్వల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టి దోమలను నియంత్రిస్తున్నాం.

-కేవీ. రమణాచారి, మున్సిపల్ కమిషనర్

కేసీఆర్ పాలనలో వ్యవసాయ మార్కెట్లు బలోపేతం


నకిరేకల్ : అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయ మార్కెట్లు బలోపేతం అయ్యాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని నిమ్మ మార్కెట్‌లో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, కాంప్లెక్స్, ఇతర అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ నర్సింహ, మార్కెట్ కార్యదర్శి శ్రీనాథరాజు, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ సామ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నకిరేకల్ పట్టణంలోని కొండ పద్మకు మంజూరైన రూ.3.50 లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురికి, కేతేపల్లి మండలానికి చెందిన ఇద్దరికి మైనార్టీ కార్పొరేషన్ చెక్కులను అందజేశారు.

దాడులు చేస్తే సహించేది లేదు

కేతేపల్లి : రాజకీయ కక్షలతో బీఆర్ఎస్ కార్యకర్తలపై భౌతిక దాడులు చేస్తే సహించేది లేదని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని భీమారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కమ్మంపాటి ఎల్లయ్యను సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట భీమారం సర్పంచ్ బడుగుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

'అభివృద్ధి చూసి ఓర్వలేక దాడులు'

కేతేపల్లి : నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రత్యర్థి వర్గంవారు హత్యా రాజకీయాలు చేస్తున్నారని నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ కేతేపల్లి మండల ప్రధాన కార్యదర్శి చిమట వెంకన్న ఆరోపించారు. సోమవారం వారు కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఎమ్మెల్యే అనుచరులపై భౌతిక దాడులకు పాల్పడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే కుట్ర చేస్తున్నారని అన్నారు.

క్లుప్తంగా

యాదవ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

కేతేపల్లి : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 8న నిర్వహించనున్న యాదవ గర్జన మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం కేతేపల్లిలో ఆవిష్కరించారు. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తిరుగుడు రవి, మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మవెంకటనర్సయ్యయాదవ్, సర్పంచ్ జటంగి ముత్తమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : పాలెం, నోముల గ్రామాల్లో బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు పలువురికి ఆర్థికసాయం అందజేశారు. పాలెంలో పక్షవాతంతో బాధపడుతున్న మాచర్ల ఉపేందర్‌కు రూ.10 వేలు, నోములలో అనారోగ్యంతో బాధపడుతున్న వెలమకంటి జానకిరాములకు రూ.5వేలు అందజేశారు.

ఆలయంలో చోరీ

చండూరు : మండలంలోని ఉడతలపల్లి కోదండ రామాలయంలో ఆదివారం రాత్రి హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీ చేశారు. హుండీలో నగదు సుమారు రూ.25 వేల వరకు ఉంటుందని, అదేవిధంగా అమ్మవారి పుస్తె మెట్టలను కూడా దొంగిలించారు. స్థానిక సర్పంచ్ అలివేలు ఓంకారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన విద్య అందించాలి

నకిరేకల్ : తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ మేకల నాగయ్య సూచించారు. నకిరేకల్‌లో ఐదు రోజులుగా జరుగుతున్న తొలిమెట్టు రెండో విడత శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. కోర్సు డైరెక్టర్ ఉషారాణి, ఇన్‌చార్జ్ పోతుల గోపాల్, రిసోర్స్‌పర్సన్లు, కనుకుంట్ల నవీన్ రెడ్డి, జి.సునీత, పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఉద్యోగులు

నకిరేకల్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించడాన్ని హర్షిస్తూ నకిరేకల్‌లో సోమవారం ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఆర్టీసీ కంట్రోలర్ మన్నాన్, నాగచారి, రమేష్, వేమారెడ్డి, పుల్లయ్య, ఖలీల్, రామోజీ, పరమేష్, మీలా శంకర్, వాడకట్టు శ్రీనివాస్, జానయ్య, లింగయ్య మల్లికపాల్గొన్నారు.

9న కలెక్టరేట్ ఎదుట ధర్నా

చండూరు : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఫెడరేషన్లు నిర్వహిస్తున్న దేశవ్యాప్త పోరాటంలో భాగంగా ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగుదాల వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం, శివకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ ధనుంజయ గౌడ్, ఏర్పుల సైదులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత


పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీపీ

నార్కట్‌పల్లి : గర్భిణులు తీసుకునే ఆహారంపై బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆరోగ్య లక్ష్మి కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం బి వెల్లెంల సెంటర్ ద్వారా నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారం అందజేసే కార్యక్రమాన్ని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ దుబ్బాక పావని శ్రీధర్, డాక్టర్ గాదరి రామకృష్ణ, సీహెచ్ఓ బడుగు శ్రీరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోట సరిత, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు మౌనిక, సుకన్య, రేణుక, ఏఎన్ఎంలు శ్రీనమ్మ, స్వరూప పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతేపల్లి : వరి పంటలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలని ఏఓ బి.పురుషోత్తం అన్నారు. సోమవారం గుడివాడ గ్రామంలో వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏఈఓ వీరేష్ పాల్గొన్నారు.

13న పాపన్న గౌడ్ జయంతి

నకిరేకల్ : రవీంద్ర భారతిలో ఈ నెల 13న జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జైగౌడ్ జాతీయ అధ్యక్షుడు వట్టికుటి రామారావు కోరారు. నకిరేకల్‌లోని పాపన్న గౌడ్ జయంతి ప్రచార పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


క్రికెట్ కిట్ అందజేస్తున్న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి

చిట్యాల : రోటరీ క్లబ్ సభ్యులందరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిట్యాలలో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు అనేక సేవా కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. క్లబ్ అధ్యక్షుడిగా గుండెబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా మారగోని రమేష్, కోశాధికారిగా ఎడ్ల శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా కొత్తూరు రాము, గాలి యాదగిరి, అడ్మినిస్ట్రేటర్‌గా గడ్డం సత్తిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా కమ్మంపాటి నర్సింహ, ట్రైనర్‌గా చిరబోయిన యాదయ్య, యూత్ సర్వీస్ డైరెక్టర్‌గా కమ్మలపల్లి సత్యనారాయణలు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం క్లబ్ చైర్మన్ బుచ్చిరెడ్డి సమకూర్చిన క్రికెట్ కిట్‌ను యువకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చెన్న లక్ష్మణ్, మేకల భిక్షం, నరేందర్‌కుమార్, ఖాసీం, జంగిలి సైదులు, కొత్తపల్లి నవీన్, కడారి సత్యనారాయణ పాల్గొన్నారు.

కులవృత్తి వివాదంలో ఒకరిపై దాడి

కేతేపల్లి : గ్రామంలో కులవృత్తి చేసుకునే విషయంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన తగాదాలో ఓవ్యక్తిపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈసంఘటన మండలంలోని భీమారం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకోగా సోమవారం వెలుగు చూసింది. సంఘటనకు సంబంధించి కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమారం గ్రామంలో కమ్మంపాటి ఎల్లయ్య, నాయకం నాగరాజు కుటుంబాలు చాకలి వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కులవృత్తి చేసుకునే విషయంలో రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా తగాదా కొనసాగుతోంది. వాట్సాప్ గ్రూపుల్లో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈక్రమంలో కమ్మంపాటి ఎల్లయ్య ఆదివారం రాత్రి బొడ్రాయి సమీపంలో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన నాగరాజు.. తన తండ్రి లింగయ్యతో కలిసి వెళ్లి ఎల్లయ్యతో గొడవ పెట్టుకున్నారు. ఈ గొడవలో లింగయ్య తన వెంట తెచ్చుకున్న కత్తితో ఎల్లయ్యను పొడిచాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఎల్లయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ వివరించారు. నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం డీఎంహెచ్ఓ కొండల్‌రావుకు ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. శ్రవన్‌కుమార్, ప్రశాంతి, సురేష్, తదితరులు ఉన్నారు.

యూనివర్సిటీలో పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ రూరల్ : అన్ని యూనివర్సిటీల్లో ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ చంద్ర శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నర్సింహ, వంశీ, మల్లేశం, కుషాల్, ప్రవీణ్, సాయినాథ్, నవాజ్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

వరకట్నం వేధింపు కేసులో రెండేళ్లు జైలు

రామగిరి(నల్లగొండ) : వరకట్నం వేధింపు కేసులో రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కే శ్రీవాణి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండకు చెందిన జ్యోతికుమారికి ఇబ్రహీంపట్నంకు చెందిన ఆంజనేయులుతో 2010వ సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహం సమయంలో రూ.5 లక్షల 80 వేల నగదు, ఫర్నిచర్ బంగారాన్ని పసుపు కుంకుమల కింద ఇచ్చారు. పెళ్లయిన మూడు నెలల తర్వాత అదనపు కట్నం తేవాలని జ్యోతికుమారిని ఆంజనేయులు అతడి కుటుంబ సభ్యులు వేధించారు. దీంతో జ్యోతికుమారి నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆంజనేయులును అప్పటి సీఐ పి సురేఖ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ మాధురి వాదనలతో ఏకీభవించిన జడ్జి కే శ్రీవాణి సెక్షన్ 498 ఏ, సెక్షన్ 4 కింద వరకట్నం, వేధింపులు గృహహింస చట్టం కింద ఆంజనేయులుకు రెండు సంవత్సరాల జైలు,రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

తల్లిపాల వారోత్సవాలు


నకిరేకల్ : పోషకాహార కిట్లు అందజేస్తున్న డాక్టర్లు

సాక్షి నెట్‌వర్క్ : నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యం అందించాలి

నల్లగొండ టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అద్దంకి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికులను ఆయన పరామర్శించి మాట్లాడారు. ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, జక్కుల రవికుమార్, పెరిక అంజమ్మ, పేర్ల సంజీవ, పెరిక కృష్ణ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలి

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఫస్టియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు జాయినింగ్ రిపోర్టును పానగల్ క్యాంపస్‌లో అందజేయాలని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9నుంచి విద్యార్థుల కుటుంబ సభ్యులు పానగల్ క్యాంపస్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు విజయ్‌కుమార్ సెల్ : 9490565566, శివ శంకర్ సెల్ : 9440167671 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

రామగిరి(నల్లగొండ) : మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఆగస్టు 9న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ షకీనా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర కళాశాలలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, బాలికల జూనియర్ కళాశాలల్లో బైపీసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నల్లగొండ రెడ్డి హాస్టల్‌లో జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో కిషోర బాలికల పథకం ద్వారా ప్రారంభించే వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ కేంద్రం జిల్లా మేనేజర్ ఎ.అనిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల కిశోర బాలికలు బయోడెటా జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నల్లగొండ పట్టణంలోని రామనగర్‌లో గల మహిళా ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ : 766002517, 08682-244416 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


నల్లగొండ టూటౌన్ : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు


చండూరులో నినాదాలు చేస్తున్న కార్మికులు

నల్లగొండ టూటౌన్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహానికి బీజేపీ చేనేత సెల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులను, కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేనేత సెల్ జిల్లా కన్వీనర్ తిరందాసు కనకయ్య, మిర్యాల వెంకటేశం, రాపోలు విద్యాసాగర్, కటికం శ్రీధర్, గజం పాండు, నగేష్, గంజి యాదగిరి, కొండయ్య పాల్గొన్నారు.

గాంధీ పార్కులో..

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి బీజేపీ కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మీవెంకన్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సైదులు, వెంకటేశ్వర్లు, సతీష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు : జాతీయ చేనేత దినోత్సవాన్ని చండూరు మండల కేంద్రంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తిరందాసు శ్రీను ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి మార్కండేయ ఆలయం వద్ద జాతీయ జెండాను కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీను ఆవిష్కరించారు. కౌన్సిలర్ గుంటి వెంకటేశం, సుధాకర్, కర్నాటి చిన్న, ఓంకారం గణేష్, రాపోలు వెంకటేశం, యాదగిరి, ఆంజనేయులు, చంద్రమౌళి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపోలు నారాయణ, మాస్టర్ వీవర్ల సంఘం అధ్యక్షుడు జూలూరు ఆంజనేయులు, గంజి యాదగిరి, కర్నాటి శ్రీనివాస్, చేనేత సహకార సంఘం కార్యదర్శి కర్నాటి శ్రీను, తిరందాసు ఆంజనేయులు, చేనేత సేవా సమితి కన్వీనర్ రాపోలు ప్రభాకర్, కో కన్వీనర్ ఏలె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి


జిల్లా కేంద్రంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

రామగిరి(నల్లగొండ): గద్దర్ మృతికి జిల్లా కోర్టులో సోమవారం న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, గుండె వెంకటేశ్వర్లు, గోసుల మోహన్, దర్శనం నర్సింహ, మల్లేపల్లి ఆదిరెడ్డి, మామిడి బాలయ్య, పల్లెబోయిన శ్యాంసుదర్, మేరెడ్డి నర్సింహారెడ్డి, మామిడి ప్రమీల పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రజా యుద్ధ నౌక గద్దర్ మరణం చాలా బాధాకరమని మాలమహానాడు మండల అధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత నాగిళ్ల మారయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో భిక్షం, నర్సిరెడ్డి, ముత్యాలు, మామిడి కృష్ణ, కేశగోని రామచంద్రం, సందేష్, నవీన్, హరీష్, అభి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి ఆ గ్రామ సర్పంచ్ రత్నం పుష్పనర్సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుబ్బ కుమారస్వామి, పానుగుల వెంకటేశం, కత్తుల యాదయ్య, బుస్సు వరప్రసాద్, గోపగోని నర్సింహ, మారగోని అంజయ్య, బొడిగె బక్కశెట్టి, గాలిబ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కర్ణన్‌ను సోమవారం టీఎన్‌జీఓ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణ్‌కుమార్, కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, సీహెచ్ నర్సింహాచారి, నాగిళ్ల మురళి, కె.దయాకర్‌రావు, మేడి జయరావు, ఆకునూరి లక్ష్మయ్య, జే.శేఖర్‌రెడ్డి, పాల్వాయి గామయ్య, రమ్యసుధ, భిక్షం, వహీద్, సైదులు, శ్రీనివాస్, సత్యనారాయణ, కమల, సోమేశ్వరి, గీతాంజలి, యాదయ్య, లింగయ్య, సతీష్, షఫీ పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 12న జిల్లాల్లో తలపెట్టిన ర్యాలీలు, ధర్నాలు, సెప్టెంబర్ 1న హైదరాబాదులో చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకులు యం.రాజశేఖర్ రెడ్డి, యం. సోమయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, పి.వెంకులు, కె.రత్నయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కనగల్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అంతిరెడ్డి అన్నారు. శేరి లింగోటం గ్రామానికి చెందిన 14మంది అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడాన్ని గుర్తించి సోమవారం స్టేషన్‌కు తీసుకువచ్చి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : రవాణా రంగంలో పనిచేస్తున్న జీపు, కారు, లారీ, ఆటో, డీసీఎం డ్రైవర్ల సంక్షేమానికి ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ఎలక్ట్రికల్ స్టోర్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్యాండిల్ ర్యాలీ

మర్రిగూడ : మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనునాయక్ వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క తిరుపతయ్య, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సిరిపంగి శ్రీను, ప్రధాన కార్యదర్శి జంగయ్య, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రావు, యాదిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మురళీనాయక్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నూతన పంచాయతీల ఏర్పాటుకు కసరత్తు

మర్రిగూడ : మండలంలోని పలు ఆవాస గ్రామాలను కలిపి నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు మొదలుపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. రాంరెడ్డిపల్లి పరిధిలోగల తానేదారుపల్లి, వట్టిపల్లి పరిధిలోగల బట్లపల్లి, గట్టుప్పల మండలంలోని అంతంపేట పరిధిలోగల ఆవాస గ్రామాలైన సోమరాజుగూడ, హజనాతండా, దేవులతండా, రంగంతండా, రాగ్యాతండాలను కలుపుతూ సోమరాజుగూడ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ మొత్తం మూడు నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

కనగల్ : మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామానికి చెందిన సంపంగి అనిల్ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా సోమవారం అనిల్‌కు మంజూరైన రూ.80 వేల విలువ గల చెక్కును రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండలో అనిల్ భార్యకు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు బైరగోని వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మర్రిగూడ : వర్షాకాలంలో సీజన్‌లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం వైద్యశాఖ అధికారులతో మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమలను నివారించవచ్చన్నారు. వారానికి ఒకరోజైనా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ఆయాశాఖ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు దీపక్, సీహెచ్ఓ సోమయ్య, సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మిర్యాల పద్మ, ముమ్మడి యశోద, ఎస్‌యూఓ విజయప్రసాద్, విజయమ్మ, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం

మునుగోడు : రాష్ట్రంలో రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి సాగు నీరు అందించడమే బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీపీ కర్నాటి స్వామి అన్నారు. మండలంలోని కిష్టాపురం చెరువు నుంచి ఊకొండి చెరువులోకి నీరు మళ్లించే తాళ్లవెల్లెంల ఫీడర్ చానల్ మరమ్మతులకు స్థానిక ఎమ్మెల్యే రూ.5 లక్షలు సీడీపీ నిధులు మంజూరు చేయించగా ఆ పనులను సోమవారం ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. చండూరు మార్కెట్ వైస్ చైర్మన్ జాజుల అంజయ్య గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బొజ్జ సుజాతశ్రీను, నడిపల్లి యాదయ్య, పోలగోని సైదులువిజయలక్ష్మి, భీమనపల్లి సైదులు, మాజీ ఎంపీపీ పోలగోని సత్యం గౌడ్, బూడిద లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె


నల్లగొండ రూరల్ : రాస్తారోకో చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ : నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మండల కేంద్రాల్లో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు.